ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, హాజరైన ప్రజాప్రతినిధులు

ప్రశాంతంగా జడ్పీ సమావేశం

● హాజరు కాని మెజారిటీ ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. శాసనసభ్యుల్లో జీడీ నెల్లూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు థామస్,ఎమ్మెల్యే మురళీ మోహన్ మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన వారెవరూ హాజరు కాలేదు. వీరిలో థామస్ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడగా మురళీమోహన్ నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి వెళ్లిపోయారు. తిరుపతి డీఆర్వో నరసింహులు పాల్గొనగా అన్నమయ్య జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు ఎవరూ హాజరు కాలేదు. ముందుగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జరిగిన అభివృద్ధి పనులను, ఖర్చుల వివరాలను వెల్లడించారు. సాధారణ నిధుల నుంచి సుమారు రూ.13 కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.25 కోట్లు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు, తాగునీటి సౌకర్యానికి వెచ్చించినట్లు వివరించారు.సుమారు 89మందికి కారుణ్య నియమకాల ద్వారా ఉద్యోగం కల్పించామన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులకు 10 నెలల గౌరవేతనాలు అందించడం జరిగిందని, మరో 13 నెలలకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎంపీడీవో కార్యాలయాలు, రోడ్డు పక్కనే ఉన్న జడ్పీ పాఠశాలల స్థలంలో కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించి వాటి ద్వారా జడ్పీకి అదనపు ఆదాయం లభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

● **ప్రజల ప్రాణాలతో ఆర్‌ఎంపీల చలగాటం**

తమిళనాడులో ఆర్‌ఎంపీ వ్యవస్థను నిషేధించారని, దీంతో వారిలో చాలామంది తమిళనాడు సరిహద్దులోని కుప్పం నియోజకవర్గం చేరి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని కుప్పం జడ్పీటీసీ శరవణ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.సుమారు 360మంది ఆర్‌ఎంపీలు నియోజకవర్గవ్యాప్తంగా క్లినిక్కులను నిర్వహిస్తూ చేతగాని వైద్యంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులను పెంచుతున్నారన్నారు. కుప్పం మండలంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను బదిలీ చేయాలని కోరారు.చాలామంది ఉపాధ్యాయులు బెంగళూరులో స్థిరపడ్డారని, మరికొంతమంది రియల్ ఎస్టేట్, వడ్డీ, చీటీ వ్యాపారాలతో బిజీగా వుంటూ పాఠశాలలకు సక్రమంగా హాజరుకావడం లేదని విమర్శించారు.గత సమావేశంలోనే ఈ విషయమై ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో ఫీజులకు సంబంధించి బోర్డును ఏర్పాటు చేయించాలని కోరారు. శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో శాంతిపురం మండలంలో 50 శాతం కంటే ఎక్కువ ఫెయిలయ్యారని, దీనికి కారకులు ఎవరని డీఈవోను ప్రశ్నించారు.డీఈవో వరలక్ష్మి స్పందిస్తూ... ఉపాధ్యాయుల కొరత కారణంగా ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం పాసయ్యేలా చూస్తామన్నారు.

స్పెషలిస్టుల టీంను తీసుకొచ్చే ప్రయత్నం: కలెక్టర్

సమావేశం తరువాత కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు.చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఇందు కోసం ఒక టీం పనిచేస్తోందని చెప్పారు.త్వరలో స్పెషలిస్ట్ టీంను తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు.చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి మందులు, మాత్రల కోసం ప్రభుత్వ నిధుల నుంచి సుమారు రూ.19 లక్షలు వెచ్చించామని తెలిపారు. కుప్పం నియోజకవర్గాన్ని 100 శాతం సోలరైజేషన్ చేసేందుకు వెండర్లను గుర్తించామని చెప్పారు. మే 1 నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ కోరారు. గత వారం టీడీపీ నాయకురాలు శ్రీదుర్గ ప్రమాదానికి గురై వస్తే సరైన వైద్యం అందలేదన్నారు. సీటీ స్కాన్ తీసివుంటే ఆమె బతికేదన్నారు.ప్రసవాలు కూడా సక్రమంగా జరగడం లేదని, చిన్న పాటి రిస్క్ ఉన్నా వారిని ప్రైవేటు ఆస్పత్రులకు, లేదా రుయాకు రెఫర్ చేస్తున్నారన్నారు. జిల్లా ఆస్పత్రిలోనే ఇలా వుంటే పీహెచ్‌సీల్లో వైద్యం ఏ స్థాయిలో అందుతోందో అర్థమవుతుందన్నారు.2022లో పాలసముద్రం మండలం గంగమాంబాపురానికి మంజూరైన పీహెచ్‌సీని తిరుమలరాజపురానికి మార్చాలని కలెక్టర్‌ను కోరారు. తిరుమలరాజపురంలో ఆస్పత్రి ఉంటే అధిక శాతం ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు.


గుడి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

నారాయణవనం మండలం వెంకటకృష్ణ పాళ్యం పంచాయతీ సింగిరికోనలో ఓ చిన్న గుడికి రోడ్డు పేరుతో సుమారు 6.50 కోట్ల ప్రజాధనాన్ని తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ దుర్వినియోగం చేశారని నారాయణవనం జడ్పీటీసీ సుమన్ ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యే, జడ్పీటీసీ, సర్పంచ్‌కు కూడా తెలియకుండా అటవీశాఖకు చెందిన సుమారు 40 అడుగుల భూమిలో 4 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ.6.50 కోట్లు వెచ్చించారని,ఇందుకోసం చెట్లు నరికి వేశారని,వాటిలో ఎర్రచందనం చెట్లు కూడా ఉన్నాయన్నారు. వాటిని ఏం చేశారు? ఎవరికి విక్రయించారు? అనే వివరాలను పీడీ చెప్పాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



నిర్మానుష్యంగా వున్న చిత్తూరు దర్గా సర్కిల్

పెరిగిన ఉక్కపోత



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎండలు హడలెత్తిస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచే వడగాలులు వీస్తుండడంతో జనం ఇళ్ళకే పరిమితమౌతున్నారు. మంగళవారం అత్యధికంగా నగరిలో 40.2, అత్యల్పంగా పుంగనూరులో 33.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయ్యింది. గాలిలో తేమ శాతం తక్కువకావడంతో ఉక్కపోత పెరిగి జనం అల్లాడుతున్నారు. మండలాలవారీగా నమోదైన ఉష్ణోగ్రతలు..... తవణంపల్లెలో 39.7, శ్రీరంగరాజపురంలో 38.5, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 38.4, గంగాధరనెల్లూరులో 38.2, సదుంలో 37.9, సోమలలో 37.2, వెదురుకుప్పం, గంగవరం, పెద్దపంజాణి, పులిచెర్ల, పూతలపట్టు మండలాల్లో 31.1, బంగారుపాళ్యంలో 36.9, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, యాదమరి మండలాల్లో 36.7, రొంపిచెర్లలో 36.5, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 35.9, కార్వేటినగరంలో 35.6, కుప్పంలో 35.2, రామకుప్పంలో 35, బైరెడ్డిపల్లెలో 34.6, పలమనేరులో 34.2, వి.కోటలో 33.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



తెల్లగుంట వద్ద ఎండతీవ్రతకు తెగుళ్లు సోకినట్టు ఎండిన వరిపంట

మండుతున్న ఎండలు ఎండుతున్న పంటలు

విజయపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎండల ధాటికి చెరువుల్లో, గుంటల్లో సాగునీరున్నా పంటలు ఎండి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండు నుంచి మూడు పర్యాయాలు వర్షం కురవడం వలన ఎండ తీవ్రత అంత కనిపించేది కాదు.ఈ యేడాది వర్షం అంతగా పడకపోవడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు.ఉదయం 11 గంటల నుంచీ సాయంత్రం 4 గంటల వరకు బయటకు పోవాలంటే భయంగా ఉందని రైతులు చెబుతున్నారు. రోజూ పంటలకు నీరు పారగడుతున్నా పంటలు ఎండు ముఖం పడుతున్నాయని వాపోతున్నారు. ఉదాహరణకు విజయపురం మండలంలో వేసవిలో ప్రధానంగా వరి, చెరకు పంటలతో పాటు పూల తోటలు ఎక్కువగా సాగు చేస్తారు. ఎండల తీవ్రతకు పంట పొలాల్లో నీరున్నా తెగుళ్ల సోకిన విధంగా పంటలు ఎండి పోతున్నాయని, రెండు రోజులకు ఒకసారి నీరు పారగట్టినా చెరకు పంట ఎండిపోతోందని రైతులు చెబుతున్నారు.



చెంగమనాయుడు కండ్రిగ వద్ద ఎండిన చెరకు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు
సహకరించండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందించాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా పరిశ్రమలు - ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపునకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ కింద ఇప్పటివరకు 234 దరఖాస్తులు స్వీకరించగా, 222 అనుమతులు మంజూరు చేశామన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్ర అధికారి వెంకటరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, డీపీవో సుధాకర్ రావు, పండ్ల పరిశ్రమ సమాఖ్య సభ్యుడు గోవర్ధన్ బాబి, ఎస్‌ఎస్‌సీసీఐ చైర్మన్ డేవిడ్ బ్రెయినార్డ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పానికి వాహనయోగం!

● రూ.66 లక్షల విలువైన రెండు అంబులెన్స్‌లు

● పంచాయతీలకు త్వరలో 93 ఈ-ఆటోలు



ఈ-ఆటోలు

కుప్పం, , ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):కుప్పానికి 'వాహన'యోగం పట్టింది. రెండు అంబులెన్స్‌లు, నాలుగు ఈ-ఆటోలు ఇప్పటికిప్పుడు రావడమే కాదు, ఇంకో 90 దాకా ఈ-ఆటోలకు ఒప్పందం కుదిరింది. ఒప్పందమంటే ఇదేదో నగదు చెల్లించే పరస్పర ఒప్పందం కాదు, ఉచితంగా అన్ని ఆటోలూ కుప్పం చేరబోతున్నాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి 6, 7, 8 తేదీల్లో కుప్పంలో పర్యటించారు. ఆ సమయంలో కడా ద్వారా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కంపెనీల ప్రతినిధులతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన ఈ ఒప్పందాలలో ఈ రాయిస్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం ఒకటి. యువ ఐఏఎస్ వికాస్ మర్మత్ సమర్థతతో ఎలక్ట్రిక్ ఆటోలు, బైక్‌లు తయారు చేసే ఈ కంపెనీ కుప్పానికి రావడానికి అంగీకరించింది. ఇక్కడే తయారీ యూనిట్ పెట్టాలని నిర్ణయించుకుంది. రామకుప్పం మండలం విజలాపురం సమీపంలో ఇందుకోసం 14 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది కూడా. మనకో తయారీ కంపెనీ వస్తోంది కదా.. దాని వల్ల ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి కదా అని వదిలేయలేదు కడా పీడీ. కార్పొరేట్ కంపెనీలకు ఉండాల్సిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) అంటే సామాజిక బాధ్యత గుర్తుకు వచ్చింది. సీఎస్ఆర్ కింద తమకు కొన్ని ఈ-ఆటోలు ఉచితంగా కావాలని ప్రతిపాదన పెట్టారు. ఒకటీ రెండు కాదు. ఏకంగా 93 ఆటోలు కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 93 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీకి ఒకటి చొప్పున ఈ ఆటోలు పంపితే చెత్తను సేకరించి డంప్ చేయడానికి ఉపకరిస్తాయని ప్రతిపాదించారు. కొన్నాళ్లు ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉంది. చివరికి ఈ రాయిస్ కంపెనీ అంగీకరించింది. ఈ రాయిస్ కంపెనీనుంచి తొలి విడతగా 4 ఈ-ఆటోలు గత వారం కుప్పంలోని కడా కార్యాలయం చేరాయి. మిగిలిన ఆటోలు కూడా త్వరలోనే రానున్నాయి.



కడా కార్యాలయ ఆవరణలో పార్కు చేసిన అంబులెన్సులు

పేటీఎం నుంచి రెండు అంబులెన్స్‌లు

కడా ద్వారా పీడీ వికాస్ మర్మత్ ఎప్పుడూ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉంటారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు, ఇక్కడ అభివృద్ధికి ఏరకమైన సాయం కావాలో అన్వేషిస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే పేటీఎం ప్రతినిధులతో ఇటీవల పీడీ సమావేశమయ్యారు. ఈ క్రమంలో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ కలిగిన అత్యాధునిక రెండు అంబులెన్స్‌లు ఉచితంగా ఇవ్వడానికి ఆ సంస్థ అంగీకరించింది. ఒక్కోటీ రూ.33 లక్షల విలువైన రెండు అంబులెన్స్‌లు కడా కార్యాలయం చేరుకున్నాయి. ఈ అంబులెన్స్‌లను త్వరలోనే కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సేవలకు అందుబాటులో ఉంచనున్నారు.

ఇన్‌చార్జి డీఎల్పీవోగా శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఇన్‌చార్జి డీఎల్పీవోగా పూతలపట్టు డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈయన గురువారం బాధ్యతలు స్వీకరిస్తారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం డీఎల్పీవోగా ఉన్న పార్వతి బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం చిత్తూరులోని కార్యాలయంలో ఆమెను సన్మానించారు. డీపీవో సుధాకర్ రావు, డీఎల్పీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్‌కు సర్వం సిద్ధం



పలమనేరులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ, కోఆర్డినేటర్ తదితరులు

పలమనేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని కో-ఆర్డినేటర్ మొహమ్మద్ తెలిపారు.బుధవారం ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు జరగబోయే ఈ పరీక్షను కుప్పం పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాలలో 585 మంది, పలమనేరు పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాలలో 1626 మంది విద్యార్థులు రాస్తున్నట్లు తెలిపారు. పలమనేరు పరిధిలో మహిళా పాలిటెక్నిక్, బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను మంగళవారం ఎస్వీయూ రీజియన్ ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ,చిత్తూరు జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్, కుప్పంలోని డాక్టర్ వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు, జిల్లా పరిశీలకుడు డాక్టర్ చిన్నపరెడ్డి, సెంటర్ పరిశీలకుడు సుబ్బన్న, కోఆర్డినేటర్ మొహమ్మద్ పరిశీలించారు. ఇప్పటికే హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులు పరీక్షకు గంట ముందు అయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రెవెన్యూ, పోలీసు, వైద్యశాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ను, హెచ్.బి. పెన్సిళ్లు, షార్పనర్, ఎరేజరు, హాల్ టికెట్టు తప్పకుండా వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు ఏపీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోరన్నారు. ఇతర వివరాలకు 9989064100, 9490309037 అనే నెంబర్లలో సంప్రదించాలని కో ఆర్డినేటర్ జగన్నాథరావు తెలిపారు.

స్లాట్ విధానంలో నేటినుంచి రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇకపై స్లాట్ బుకింగ్ విధానం అమలు కానుంది. ఈనెల 4వ తేదీనుంచి జిల్లాకేంద్రంలోని చిత్తూరు అర్బ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలుచేసిన ఈ విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో బుధవారం నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుకు శ్రీకారం చుట్టారు. ఇకపై రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. భూములు, ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్లకు తమ పరిధిలోని కార్యాలయాలకు చేరుకుని గంటల తరబడి వేచిచూసేవారు.ఇకపై ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, కార్వేటినగరం, నగరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం నుంచి నూతన విధానం అమలుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.ఈ ప్రాంతాల్లో రోజుకు 39 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య వారికి నచ్చిన సమయంలో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ కేటాయించిన సమయానికి రాకుంటే 20 నిమిషాల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. దీనిని రీషెడ్యూల్ చేసుకునేందుకు రూ.200 రుసుం చెల్లించాలి.





చిరంజీవి 'విశ్వంభర' కోసం
ఎదురు చూస్తున్నా
హీరోయిన్ ఆషిక రంగనాథ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'విశ్వంభర' సినిమా కోసం తాను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాని హీరోయిన్ ఆషిక రంగనాథ్ తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె, ఆలయం బయట మీడియాతో మాట్లాడుతూ 'విశ్వంభరలో చిరంజీవితో కలిసి నటించానని, అటువంటి స్టార్‌తో నటించాలంటే అదృష్టం కూడా ఉండాలన్నారు. కాగా తమిళంలో 'సర్దార్2', కన్నడలో మరో చిత్రంలో నటిస్తున్నట్టు వివరించారు.ఇక, తిరుమల శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగిందంటూ ప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


దుమ్ములేవకుండా శుభ్రం చేస్తుంది

● టీటీడీకి విరాళంగా ఆధునిక వాహనం



తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): దుమ్ము లేవకుండా వీధులు శుభ్రం చేసే వాహనం ఒకటి టీటీడీకి మంగళవారం విరాళంగా అందింది. రూ.25 లక్షల విలువైన ఈ వాహనాన్ని రోస్సెరి ప్రొఫెషనల్ అనే సంస్థ విరాళంగా ఇచ్చింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి వాహనం తాళాలు అందుకుని పనితీరును పరీక్షించారు. జర్మన్ కంపెనీకి చెందిన ఈ వాహనం చాలా అడ్వాన్స్ టెక్నాలజీతో కూడుకున్నదని ఆయన చెప్పారు. క్లీనింగ్ సమయంలో దుమ్ము పైకి లేవకుండా నీటిని చల్లుతూ ఆలయ పరిసరాలను శుభ్రపరుస్తుందన్నారు. 8 గంటల పాటు ఛార్జింగ్ పెడితే దాదాపు 46 కిలోమీటర్ల మేర వినియోగించవచ్చని వివరించారు.

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,904

తలనీలాలు సమర్పించినవారు: 24,487



బంగారం ధరలు ఇలా

24 క్యారెట్లు(10 గ్రాములు): 99,000

22 క్యారెట్లు(10 గ్రాములు): 89,940

సవర బంగారం : 74,112

కిలో వెండి : 1,00,300





కళ తప్పిన పసిడి

అక్షయ తృతీయ...గత కొన్నాళ్లుగా ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది బంగారమే..వైశాఖ మాసంలో తొలి తదియకు పురాణాల ప్రకారం విశిష్ట ప్రాధాన్యముంది. ఈ రోజున ఏం చేసినా అక్షయంగా ఉంటుందని ఎక్కువ మంది విశ్వసిస్తారు. అందుకే బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఈరోజు కొంటే అక్షయంగా పెరుగుతుందని నమ్ముతారు. అందుకే మహిళలు ఈ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. వీరిని ఆకర్షించేందుకు బంగారం వర్తకులూ పోటీపడుతుంటారు. ప్రత్యేక ఆఫర్లు,డిస్కౌంట్లూ ప్రకటిస్తుంటారు. అయితే ఈ ఏడాది మున్నెన్నడూ లేని విధంగా బంగారం ధరలు పెరిగి కలవర పెడుతున్నాయి. కొనుగోలుదారులు..వర్తకుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. .షాపులో అడుగు పెట్టాలంటేనే మధ్యతరగతి వర్గాలు జంకుతున్నాయి. ఆశించిన అమ్మకాలు లేకపోవడంతో వ్యాపార వర్గాలూ నీరుగారుతున్నాయి. అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఈ వర్గాలు నిరీక్షిస్తున్నాయి.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

● గణనీయంగా పెరిగిన బంగారం ధరలు ● వెలవెలబోతున్న షాపులు
● అక్షయ తృతీయ మీద వ్యాపారుల ఆశలు

ఆఫర్లు ప్రకటించి ఎదురుచూస్తున్నాం



చాలా రోజులుగా వ్యాపారం లేవు. ఖాళీగా ఉంటున్నాం. గత ఏడాదికంటే పది గ్రాముల బంగారం ధరపై సగటున రూ.30వేలకు పైగా పెరిగిపోయింది. కొనుగోలు దారులు బాగా తగ్గిపోయారు. కొంతకాలం ఆగి తరువాత కొనుగోలు చేసుకుందామని ఆలోచిస్తున్నారు. అక్షయతృతీయ సందర్భంగా తరుగు, కూలీచార్జీలు లేకుండా ఆఫర్లు ప్రకటించాం. బుధవారం అయినా కొనుగోలుదారులు వస్తారని ఆశిస్తున్నాం.

- కె.వి. సత్యనారాయణ, అధ్యక్షుడు, తిరుపతి గోల్డ్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్

గత ఏడాది కంటే 30 శాతం పైకి ధరలు

తిరుపతి నగరంలో బంగారం షాపులు సుమారుగా 80వరకూ ఉన్నాయి. అన్ని బ్రాండెడ్ షాపులూ ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇక్కడ రూ.2కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వ్యాపారలావాదేవీలు జరుగుతాయి. గతేడాది మే 10న అక్షయ తృతీయ పర్వదినం సరికి గ్రాము బంగారం ధర (24 క్యారెట్లు) రూ.6,600 ఉండేది. దీంతో ఒక్క అక్షయ తృతీయ రోజునే రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల వరకూ వ్యాపారం జరిగింది. కొద్ది నెలలుగా ప్రపంచ వాణిజ్య రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతం డాలర్ ఫౌండ్ విలువ రూ.3,000 నుంచి 3,500 వరకు ఉండగా.. వచ్చే సంవత్సరానికి ఆ ధర రూ.4,500 నుంచి రూ.6,000 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక తర్వాత బంగారం ధర అమాంతం పెరిగిపోయింది. గతేడాది బంగారు గ్రాము ధర రూ.6,600 ఉండగా.. ఈ సంవత్సరం గ్రాము బంగారు ధర రూ.9,000కి చేరింది. అంటే రూ.3000 వరకూ పెరిగింది. ఈ ధరల పెరుగుదల ఇంతటితో ఆగుతుందనే నమ్మకం కూడా లేదు. దీంతో కొనుగోలుదారులు సంశయంలో పడిపోయారు.

రూ.2కోట్ల మేర వ్యాపారం జరగదా?

బుధవారం నాటి అక్షయ తృతీయ మీద వ్యాపార వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కనీసం రూ.2 కోట్ల మేరయినా అమ్మకాలు జరగకపోతాయా అని ఎదురు చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆశించిన మేర అమ్మకాలు జరగడంలేదని ఈ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. సాధారణంగా చాలామంది అక్షయ తృతీయ రోజున అంతోఇంతో బంగారం కొనుగోలు చేస్తుంటారు. కొద్దిరోజులుగా బంగారం ధరలు విని వీరు వెనుకంజ వేస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.లక్షకు ఎగబాకడంతో గుండెలు బాదుకుంటున్నారు. అక్షయ తృతీయకు ఈసారి పరిమితంగా కొనుగోలు చేయాలనుకుంటున్నామని తిరుపతిలోని కాపువీధికి చెందిన మధ్యతరగతి గృహిణి శ్రీదేవి చెప్పారు. మార్కెట్ ట్రెండ్ ప్రకారం ఈసారి ఆశించిన మేర అమ్మకాలు జరగకపోవచ్చునని కొందరు బంగారు వర్తకులు కూడా అభిప్రాయపడుతున్నారు.

నాణ్యత తనిఖీకి అవకాశం

గతంలో బంగారం కొంటున్నప్పుడు చాలామంది నాణ్యత చూసేవారుకాదు. ఇప్పుడు కొనుగోలుదారుల్లో అవగాహన పెరిగింది. హాల్ మార్క్ ఉందోలేదో చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌యూఐడీ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రతి బంగారు వస్తువు పైన హెచ్‌యూఐడీ నంబర్ ఉంటుంది. బీఐఎస్ హాల్ మార్క్ తనిఖీ చేసి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా హెచ్‌యూఐడీ నంబర్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకునే సౌకర్యముంది. దీని ప్రకారం బంగారం నాణ్యతను గుర్తించవచ్చు.

తిరుమలలో తెలంగాణవాసి మృతి

● మూర్ఛవ్యాధితో మరుగుదొడ్డిలోనే కుప్పకూలాడు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఒక పబ్లిక్ మరుగుదొడ్డిలో మంగళవారం తెలంగాణవాసి ఒకరు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గద్వాల్‌కు చెందిన సురేష్‌గౌడ్(40) ఇరవై రోజుల కిందట ఇంటి నుంచి వచ్చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. అయితే సురేష్ గౌడ్ తిరుమలలో ఉంటున్నాడనే సమాచారంతో వారు రెండురోజుల కిందట తిరుమలకు చేరుకుని గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సీఆర్వో కార్యాలయం వద్దనున్న మరుగుదొడ్డిలో ఒక వ్యక్తి మృతదేహం ఉందని తెలిసి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతను సురేష్ గౌడ్ అని నిర్ధారించుకుని వారు కన్నీరుమున్నీరయ్యారు. గత కొంతకాలంగా సురేష్‌గౌడ్ మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడని, అనారోగ్యంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగాల తొలి జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి తొలి జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఉద్యోగ నియామకాల నోడల్ అధికారి డాక్టర్ పార్థసారధిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను ప్రభుత్వ, ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. అందులో అభ్యంతరాలు కలిగిన అభ్యర్థులు మే 7వ తేదీ లోపు ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగ నియామకాల నోడల్ అధికారికి లిఖిత పూర్వకంగా పంపాలని పేర్కొన్నారు. అభ్యంతరాల కొరకు 80746 20526లో సంప్రదించాలని తెలిపారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.95కోట్లు



శ్రీకాళహస్తి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,95,63,129 వచ్చింది. హుండీలను మంగళవారం ఉదయం లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 47.100 గ్రాములు, వెండి 702.100 కిలోలు, విదేశీ కరెన్సీ 158 వచ్చాయి. గత నెల 27 నుంచి ఈ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

నిశిరాత్రి యజమానిని కాపాడిన శునకం

● ఏనుగుల వదంతితో బావిలో పడిన వ్యక్తి
● కుక్క అరుపులు విని రక్షించిన అటవీసిబ్బంది



ఈశ్వరరావుతో అటవీసిబ్బంది

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యజమాని ప్రాణాలను కాపాడిందో శునకం. వివరాలు ఇలా.. సోమవారం రాత్రి భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి చిన్నగొట్టిగల్లు మండలం చిట్టెచెర్ల, దేవరకొండ పంచాయతీలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను గుర్తించేందుకు తిరుగుతున్నారు. ఈక్రమంలో ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ పరిధిలోకి ప్రవేశించారు. అప్పటికే రాత్రి ఒంటి గంట దాటింది. అదే సమయంలో .సుబ్బరామాపురానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన పెంపుడు కుక్కతో పొలం వద్దకు కాపలాగా ఉన్నాడు. చుట్టు పక్కల రైతుల నుంచి ఏనుగులొచ్చాయంటూ గట్టిగా అరపులు విన పడడంతో ఈశ్వరయ్య ఉలిక్కిపడ్డాడు. వెంటనే పరుగుతీశాడు. ప్రాణ భయంతో హడావిడిలో దగ్గరలోని బావిలో పడిపోయాడు. కటిక చీకటి. సమీపాన ఎవరూ లేరు. అయితే యజమాని కష్టంలో ఉన్నాడని అతని పెంపుడు కుక్క గ్రహించింది. అదేపనిగా గట్టిగా అరవడం ప్రారంభించింది. ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఏఫ్ఆర్ఓ వెంకటరమణ ఆధ్వర్యంలోని ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ గమనించింది. ఏం జరిగిందో తెలుసుకుందామని వెంటనే అక్కడకు చేరుకుంది. భావిలో పడి ఉన్న ఈశ్వర్యను గుర్తించింది. అటవీ శాఖ సిబ్బంది దిగి ఈశ్వరరావును రక్షించి బయటకు తీశారు. పెంచుతున్న విశ్వాసానికి అర్ధరాత్రి అరణ్యప్రాంతంలో ఆ శునకం చూపిన ప్రేమాభిమానానికి అక్కడివారంతా ఆశ్చర్యపోయారు.

ఇక, రాత్రి గస్తీల్లో డ్రోన్

● పోలీసుల అదుపులో పది మందికి కౌన్సెలింగ్



డ్రోన్ కెమెరాతో పోలీసుల పహరా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాత్రి గస్తీల కోసం కేవలం బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు మాత్రమే రోడ్లపై తిరిగేవారు. అన్ని వీధులు, సందులు, గొందుల్లోకి వెళ్ళడానికి వీరికి సాధ్యపడే పని కాకుండా పోయింది. ఈ క్రమంలో రాత్రి గస్తీకి డ్రోన్ వినియోగించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు భావించారు. దీనికిగాను అత్యంత శక్తిమంతమైన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా వినియోగించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి తిరుపతి, శివారు ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి రాత్రి పహారా కాశారు. తద్వారా అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న అకతాయిలు, కొందరు మందుబాబులను గుర్తించారు. అలా 10 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా రాత్రి గస్తీల్లో డ్రోన్‌నూ భాగస్వామిని చేయనున్నారు. దీనికోసం తిరుపతి నగరాన్ని మూడు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో ఒక్కో రాత్రి డ్రోన్ నిఘా ఉంచుతారు. ఇది అరకిలోమీటరుకు పైగా నింగిలోకి వెళ్లి.. మూడు కిలోమీటర్ల వ్యవధిలో కవర్ చేస్తుంది. ఏ సమయంలోనైనా.. ఎక్కడ నుంచైనా ఎమర్జెన్సీ కాల్ వస్తే వెంటనే డ్రోన్ కెమెరా ద్వారా లోకేషన్ అడ్రస్ ట్రేస్ చేసి బాధితులకు న్యాయం చేసే వెసులుబాటు కలుగుతోంది. లోకేషన్ అడ్రస్ చెప్పడం ఆలస్యం కాకుండా డ్రోన్ కెమెరాను అటుగా దిశ మళ్ళించి ఆగమేఘాల మీద ఆకాశంలో దూసుకుంటూ స్పాట్‌కు చేరుతుంది. తద్వారా పోలీసులు భద్రతా చర్యలు తీసుకుంటారు. తిరుపతి ప్రజలు, భక్తులు అర్ధరాత్రయినా ప్రశాంతమైన వాతావరణంలో గడపాలనే ఉద్దేశ్యంతో ఈ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ చెప్పారు.

విధి నిర్వహణలో హోంగార్డు మృతి



పాకాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపక కేంద్రంలో హోంగార్డుగా పనిచేస్తున్న సురేంద్రరెడ్డి (32) మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందాడు విధి నిర్వహణలో ఉన్న అతనికి మధ్యాహ్నం గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సహచర సిబ్బంది వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సురేంద్ర రెడ్డి స్వగ్రామం చిత్తూరు మండలం తాళంబేడు. ఈయనకు భార్య,ఆరునెలల పాప వున్నారు.

ఈకేవైసీ చేసుకోవాల్సింది 1.08 లక్షల మంది

● నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సంబంధించి జిల్లాలో ఇంకా 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 16.05 లక్షల మంది రేషన్ కార్డుల్లో సభ్యులుగా వున్నారు. వీరిలో ఈనెల 29 వరకు దాదాపు 15 లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇక 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోకుండా దూరంగా వున్నారు. వీరందరికీ బుధవారం ఆఖరి గడువు విధించింది. అప్పటికే మూడు సార్లు గడువు పెంచిన ప్రభుత్వం మళ్లీ ఈకేవైసీ చేసుకోవడానికి గడువు పెంచుతుందా లేదా అనేది బుధవారం సాయంత్రానికి తెలుస్తుందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, గూడూరు, కోట, నాయుడుపేట, పుత్తూరులోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 3వ తరగతి ప్రవేశాల కోసం అర్హత గల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజా సోము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంరక్షకుల ఆదాయం సంవత్సరానికి రూ.లక్ష మించరాదన్నారు. అలాగే 4 నుంచి 9వ తరగతి వరకున్న ఖాళీలకు కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99856 74700లో సంప్రదించాలన్నారు.

సూర్యవంశీ ఒక అద్భుతం

● శ్రీవారి సన్నిధిలో చెబుతున్నా పెద్ద ప్లేయర్ అవుతాడన్న క్రికెటర్ శ్రీశాంత్



ఆలయం ముందు కుటుంబంతో శ్రీశాంత్

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'సచిన్ టెండూల్కర్ రంజీ మ్యాచుల్లో 14 ఏళ్లకే సెంచరీ చేసిన విషయాన్ని విన్నాం. ఐపీఎల్ వంటి పెద్ద ఆటలో 14 ఏళ్ల కుర్రాడు సెంచరీ కొట్టడం అంటే అదో అద్భుతం. గుజరాత్‌పై మ్యాచ్‌లో సూర్యవంశీ సూర్యుడిలా చెలరేగిపోయాడు' అని టీం ఇండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ప్రశంసలతో ముంచెత్తారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి సన్నిధి నుంచి చెప్తున్నా వైభవ్ సూర్యవంశీ చాలా పెద్ద ప్లేయర్ అవుతాడన్నారు.

ది రియల్ తలై అజిత్ అన్నా

తమిళ హీరో అజిత్ పద్మభూషణ్ అవార్డు తీసుకోవడంపై శ్రీశాంత్ సంతోషం ప్రకటించారు. అజిత్‌కు తానో పెద్ద అభిమాని అని, ఆయన డైలాగ్స్ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. 'ది రియల్ తలై అజిత్ అన్నా' అన్నారు. ఇక, రాజకీయాల్లో ఎంట్రీపై ప్రశ్నించగా ప్రస్తుతం అలాంటి ఆలోచనలు ఏవీ లేవని బదులిచ్చారు.

జయరాంచౌదరిని వర్చువల్‌గా విచారించనున్న కోల్‌కత్తా హైకోర్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మయూర జయరాం చౌదరిని కోల్‌కత్తా హైకోర్టు బుధవారం వర్చువల్ విధానంలో విచారించనుంది. చక్కెర సరఫరా చేస్తామంటూ కోల్‌కత్తాకు చెందిన టెరాయ్ ఓవర్సీస్ సంస్థకు చక్కెర సరఫరా చేస్తామని 2014లో జయరామ చౌదరి రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో ఆ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. దీనిపై విచారించిన న్యాయస్థానం జయరాంచౌదరిని అరెస్టుచేసి కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. ఆ మేరకు తిరుపతి పోలీసులు అరెస్టుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం కోల్‌కత్తా హైకోర్టు జయరాం చౌదరిని పోలీసుల సమక్షంలో వర్చువల్ విధానంలో విచారించనుంది.

తిరుమలలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు



రాజపక్సకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ ఈవో

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీలంక మాజీ అధ్యక్షుడు నందసేన గొటబయ రాజపక్స శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని సమిష్టి అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవోఆర్ భాస్కర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. రాజపక్స బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)లో 2025 విద్యాసంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 24వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 9492861369, 8500021856 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్మగ్లర్ అరెస్టు

మంగళం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భాకరాపేట అటవీప్రాంతంలోకి ప్రవేశిస్తున్న ఓ స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి పిడిలేని ఇనుప గొడ్డలి, బారిసను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం భాకరాపేట చామల సెక్షన్‌లో కూంబింగ్ నిర్వహించారు. తిరుపతి -పీలేరు రోడ్డు వైపున నిషేధిత అటవీప్రాంతంలోకి ముగ్గురు వ్యక్తులు వెళుతూ టాస్క్ ఫోర్స్ పోలీసుల కంటపడ్డారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా అడవుల్లోకి పారిపోయారు. అయితే ఒకరిని పట్టుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 గంటలు ఆలస్యంగా 'పూరీ ఎక్స్‌ప్రెస్'

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుపతి- పూరీ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ తొమ్మిది గంటలు ఆలస్యంగా నడిచింది. సోమవారం రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్, మంగళవారం ఉదయం 7 గంటలకు చేరుకొంది. దీంతో వందలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. భక్తులు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న వారు నిర్ణీత సమయానికి దర్శనానికి వెళ్ళలేక పోయారని తెలిసింది. సకాలంలో తిండి లభించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక, మంగళవారం తిరుపతిలో 10.40 గంటలకు బయలు దేరాల్సిన పూరీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.45 గంటలకు బయలు దేరి వెళ్ళిందని అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ప్రయాణికులు తిరుపతి రైల్వే స్టేషన్‌లో మూడుగంటలు నిరీక్షించారు.

అయ్యో.. ఎంత ఘోరం





మృతులు బి.శ్రీనివాసులు, వసంత్, కె.శ్రీనివాసులు



ఐదంతస్తుల భవనంపై నుంచి పడి మృతిచెందిన తాపీ మేస్త్రీలు



భర్త బి.శ్రీనివాసులు మృతదేహాన్ని చూసి విలపిస్తున్న ప్రమీల

- ఐదంతస్తుల భవనంపై నుంచి పడి ముగ్గురు తాపీ మేస్త్రీల దుర్మరణం
- తిరుపతిలో పూత పనిచేస్తుండగా ఘటన
- మృతుల్లో బావ, బామ్మర్ది

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఐదంతస్తుల ఇంటికి పూత వేసేందుకు కట్టిన సారవ తాడు ఊడిపోవడంతో విషాదం చోటుచేసుకుంది. సుమారు 50 అడుగులకు పైనుంచి కింద పడి ముగ్గురు మేస్త్రీలు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన మంగళవారం ఉదయం తిరుపతి రూరల్ తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో జరిగింది. ఇక్కడి హెచ్ఐజీలో ఏడాదిగా ఐదంతస్తుల ఇల్లు కడుతున్నారు. ఆ ఇంటి బయట గోడలకు మంగళవారం పూతపని మొదలు పెట్టారు. దీనికోసం కింద నుంచి పై అంతస్తు వరకు కొయ్యలతో సారవ కట్టారు. ఈ సారవపై నిలబడి గోడకు పూత పని చేస్తుండగా ఉదయం 10.40గంటల సమయంలో అడ్డసారవ కొయ్యలకు కట్టిన తాడు ఊడిపోయింది. మిగతా కొయ్యలు అటు ఇటు కదలడంతో వాటిపై నిలబడివున్న తాపీ మేస్త్రీలు.. పెళ్లకూరు మండలం అక్కగారిపేటకు చెందిన బి.శ్రీనివాసులు, జీవనోపాధి నిమిత్తం ఒంగోలు నుంచి పదేళ్ల కిందట శ్రీకాళహస్తికి వచ్చి స్థిరపడిన కె.శ్రీనివాసులు, అతడి బావమరిది టి.వసంత్ అదుపుతప్పి పడిపోయారు. సారవకొయ్యలకు, గోడకు కొట్టుకుంటూ కింద పడటంతో ఇద్దరు దుర్మరణం చెందారు. 108 అంబులెన్స్‌ను రప్పించే లోపే మరొకరు తుదిశ్వాస విడిచారు. కావలికి చెందిన మరో మేస్త్రీ మాధవ ఓ చేతితో అడ్డకర్రను పట్టుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులకు, పంచాయతీ అధికారులకు ఇంటి యజమాని సమాచారమిచ్చారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుచానూరు డీఎస్పీ బి.ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు బాలకృష్ణరెడ్డి, సాయినాద్‌చౌదరి, అరుణకుమారి, తహసీల్దారు భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఉద్యోగులు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ఇంటి యజమాని స్రవంతి, ఆమె మామ, విశ్రాంత ఉపాధ్యాయుడు కడివేటి ఆండాలయ్య, సారవకు తాళ్లు కట్టిన ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.



కొడుకు వసంత్, అల్లుడు శ్రీనివాసులు మృతితో విషాదంలో రమణమ్మ

మేమెలా బతకాలి?

మృతుల కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో శ్రీకాళహస్తి నుంచి వాళ్లంతా వచ్చారు. భర్త బి.శ్రీనివాసులు మృతదేహం వద్ద ప్రమీల, కుమారుడు వసంత్, అల్లుడు కె.శ్రీనివాసులు మృతదేహాలను చూసి బ్రహ్మయ్య, రమణమ్మ కన్నీరుమున్నీరయ్యారు. 'మిమ్మల్ని పోగొట్టుకున్న మేము ఎలా బతకాలి? పిల్లలు ఏమైపోవాలి? మా పరిస్థితి ఏంటి' అంటూ తలబాదుకున్నారు. ఆ ప్రాంతమంతా విషాదం నెలకొంది.

అనుమతి లేకనే నిర్మాణమా?

ఈ ప్రాంతంలో జీ ప్లస్ త్రీ వరకే నిర్మాణానికి అవకాశం ఉంది. కానీ ఐదంతస్తుల భవనం నిర్మిస్తున్నారంటే.. అనుమతి తీసుకోలేదా? ఒకవేళ అనుమతి లేకుడా ఇంత పెద్ద భవనం నిర్మిస్తుంటే పంచాయతీ అధికారులు ఏ చేస్తున్నట్లు? ఇదీ స్థానికంగా వ్యక్తమవుతున్న ప్రశ్నలు. ఈ క్రమంలో ఐదంతస్తులకు అనుమతులు ఉందా లేదా అనేది విచారిస్తామని ఏఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. కార్మికుల పట్ల ఎలాంటి భద్రతా చర్యలు తీసుకున్నారనేది దర్యాప్తులో పరిశీలిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఈవోపీఆర్డీకి షోకాజ్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తుడా అప్రూవల్ మూడు అంతస్తుల వరకే ఉంది. కానీ ఐదంతస్తులకుపైగా నిర్మాణం జరుగుతున్నా అడ్డుకోలేదు. ఇలా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈవోపీఆర్డీ మాధురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ భవన నిర్మాణంతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవన యజమానికి కార్మిక నష్టపరిహారం చట్టం కింద కార్మిక శాఖ అధికారులు నోటీసులు అందించారని, మృతుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

దారం ఊడిపోవడంతోనే ఘటన



'సారవకు కట్టిన తాళ్లు ఊడిపోవడంతో ప్రమాదం జరిగింది. జీ ప్లస్ త్రీ భవన నిర్మాణానికి అనుమతులున్నాయి. మరో రెండు అదనంగా వేశాం' అంటూ కె.ఆండాలయ్య తెలిపారు.

అంతా క్షణాల్లోనే..



ఐదో అంతస్తు వద్ద గోడకు పూత పని చేస్తుండగా అడ్డసారవకు కట్టిన దారాలు ఊడిపోయాయి. దాంతో ముగ్గురు మేస్త్రీలు కిందపడి చనిపోయారు. నేను ఓ చేత్తో కొయ్యను పట్టుకొని ఉండడంతో మృత్యువు నుంచి బయటపడ్డా. అంతా క్షణాల్లోనే, విషాదం చోటుచేసుకుంది.

\- మాధవ, తాపీ మేస్త్రి

డాడీకి ఏమైందమ్మా?

పెళ్లకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం అక్కగారిపేట ఎస్సీ కాలనీకి చెందిన బుడతేటి శ్రీనివాసులు (38)కు భార్య ప్రమీల, కొడుకు వరుణ్‌తేజ, కుమార్తె రోషిణి ఉన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారాయన. తిరుపతిలో పూత పని చేస్తుండగా మంగళవారం నాటి ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. భర్త మృతితో విలపిస్తున్న ప్రమీలను చూసి.. 'డాడీకి ఎమైందమ్మా' అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్నారులను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు.



శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)

పకడ్బందీగా మోదీ సభకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃనిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమన్వయ సమావేశం జరిగింది. గుంటూరు ఈస్టు, గుంటూరు వెస్టు, పత్తిపాడు నియోజకవర్గాలకు పరిశీలకులుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని పాల్గొనే సభకు మూడు నియోజకవర్గాల నుంచి దాదాపు 90 వేల మందికి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు తిరిగి ఇంటికి చేరుకునే వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలని నేతలకు సూచించారు.

పీఈఎస్‌లో ల్యాప్రోస్కోపీ శస్త్రచికిత్సలపై శిక్షణ



పీఈఎస్‌లో శిక్షణ కార్యక్రమంలో వైద్య ప్రముఖులు

కుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలో మంగళవారం జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ల్యాప్రోస్కోపీ శస్త్ర చికిత్స, సర్జికల్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి స్విమ్స్ ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ మొగిలీశ్వరయ్య, డాక్టర్ సి.శ్రీకాంత్‌రెడ్డి, చిత్తూరు అపోలో హాస్పిటల్ డాక్టర్ రామకృష్ణ, బెంగళూరు మెడికల్ కాలేజ్ డాక్టర్ సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. చికిత్సలో తీసుకోవాల్సిన పద్ధతులు, జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ప్రాథమిక దశలో హెర్నియా చికిత్స నుంచి ఆధునిక ల్యాప్రోస్కోపీ శస్త్ర చికిత్సల వరకు విస్తృత అంశాలపై వైద్య నిపుణులు విలువైన ఉపన్యాసాలు ఇచ్చారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ చెన్నప్ప చిదంబరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ఏపీఎంసీ అబ్జర్వర్‌గా డాక్టర్ సుజయ్, వివిధ ప్రాంతాల్లోని వైద్య కళాశాలల నుంచి వచ్చిన 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని శ్రీలంక మాజీ అధ్యక్షుడు గొటబయ రాజపక్స కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గొటబయ రాజపక్సకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ప్రధాని పర్యటన విధులకు డీఎస్వో, డీఎం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే రెండో తేదీన అమరావతిలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా నుంచి పలువురు అధికారులను విధులకు కేటాయిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్వో) శంకరన్, సంస్థ జిల్లా మేనేజరు (డీఎం) బాలకృష్ణ ఉన్నారు. వీరు అమరావతిలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా డాక్టర్ రాధ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈమె రుయాలో అనస్తీషియా విభాగాధిపతిగా ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. అనంతరం ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా రెండు రోజులు క్రితం రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలకు, జీజీహెచ్ ఆస్పత్రులకు ప్రిన్సిపాళ్లను, సూపరింటెండెంట్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రుయా సూపరింటెండెంట్‌ను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే వీటిల్లో తిరుపతి, నంద్యాల, నెల్లూరు వైద్య కళాశాలలకు సంబంధించి ప్రిన్సిపాల్ నియామకాల్లో మంగళవారం మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగానే రాధను ప్రిన్సిపాల్‌గా నియమించింది.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



ఆరాధన మృతదేహం

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మ హత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం తిరుపతిలో చోటు చేసుకుంది. యూని వర్శిటీ సీఐ రామయ్య కథనం మేరకు.. కుప్పం మండలం బంగారునత్తానికి చెందిన జగదీష్ ఉద్యోగ రీత్యా చెన్నైలో ఉంటున్నాడు. ఈయన కుమార్తె ఆరాధన (21) మారుతీ నగర్ వద్ద వున్న పీజీ హాస్టల్లో ఉంటూ పద్మావతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్స రం చదువుతోంది. ఈమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మంగళవారం హాస్టల్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు.

వైఎస్ షర్మిల వ్యాఖ్యలపై ఫిర్యాదు



వైఎస్ షర్మిలపై ఫిర్యాదు చేస్తున్న న్యాయవాది పూల ప్రేమ్‌కుమార్

పుంగనూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అంతర్గత టెర్రరిస్టు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డిపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని పుంగనూరు న్యాయవాది పూల ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్‌కు ఆధారాలను జత చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిఘా వ్యవస్థలు దేశం కోసం పని చేయడం లేదని, ప్రజల్లో శాంతి కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు ఆమె మాట్లాడటం సరికాదన్నారు. షర్మిలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదిగదిగో గజరాజులు!

- అడవుల్లో ఏనుగుల జాడ కనిపెట్టేందుకు డ్రోన్ల వినియోగం




ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఏనుగులు ఎక్కడ తిష్ట వేశాయి. ఎన్ని ఉన్నాయి? ముందుకు వస్తున్నాయా, అడవిలోకి వెళ్తున్నాయా? అని డ్రోన్లసాయంతో గజరాజుల జాడ తెలుసుకునేలా అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఈ వివరాల ఆధారంగా ట్రాకర్ల ద్వారా ఏనుగులను దారి మళ్లించడంతో పాటు సమీప ప్రజలను అప్రమత్తం చేస్తారు. శేషాచల అడవుల్లో నుంచి ఏనుగులు వేసవి రాగానే పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. ట్రాకర్లతోను, రైతులూ దండుగా వెళ్లి అరచి, క్రాకర్స్ పేల్చి బెదిరిస్తే గతంలో ఏనుగులు అడవిలోకి వెళ్లేవి. ఇప్పుడు తిరగబడుతున్నాయి. తాజాగా ఓ రైతును తొక్కి చంపాయి. ఈ క్రమంలో ఏనుగుల జాడ పసిగట్టి.. వాటిని కట్టడి చేసేందుకు రూ.2.5 లక్షలతో అటవీశాఖ డ్రోన్‌ను కొనుగోలు చేసింది. అర కిలో మీటరు ఎత్తులో ఎగురుతూ 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఏనుగుల కదలికలు, పొదల్లో నక్కి ఉన్నా లైవ్ విజువల్ పంపుతుంది. అడవుల్లోకి ఏనుగులను తరుముతున్నప్పుడు (డ్రైవ్) ముందుకే పోతున్నాయా? ఎదురు తిరుగుతున్నాయా? నెమ్మదిగా పోతున్నాయా? ఆ గుంపులో గున్నలు ఉన్నాయా అనేది తెలుసుకుని సులభంగా డ్రైవ్ చేయొచ్చని అధికారులు అంటున్నారు. భాకరాపేట రేంజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ డ్రోన్‌ను తొలిసారిగా చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీలోని పొలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. తలకోన సౌత్ బీట్ పరిధిలో ఏనుగుల కదలికలను ఈ డ్రోన్ సాయంతో గుర్తించి అక్కడి రైతులను అప్రమత్తం చేశారు.

కోలాహలంగా రథోత్సవం

- పురవీధుల్లో విహరించిన శివపార్వతులు

సోమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామివారి రథోత్సవం భక్తుల శివనామస్మరణల నడుమ కోలాహలంగా జరిగింది. శివపార్వతుల ఉత్సవ మూర్తులు రథంపై ఊరేగారు. నాలుగు మాడ వీధుల్లో త్రిశూల ఊరేగింపు, బలిహరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హరిముని వెంకటాచారి ఆధ్వర్యంలో రథ కలశాన్ని మంగళ వాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించి రథంపై ప్రతిష్ఠించారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రథానికి శాస్త్రోక్తంగా వేదపండితులు పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు మడుగు రథానికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు సోమశేఖర్, శోభన్‌బాబు, బీవీఎస్ బాబు, నరేంద్రబాబుల కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



రథాన్ని లాగుతున్న చిన్నారులు, మహిళలు (ఇన్‌సెట్‌లో) శివపార్వతులు

రక్తంతో లోకేష్ - శ్రీకాంత్ చిత్రం




రక్తం ఇస్తున్న యువకుడు నవీన్ - టీడీపీ కార్యకర్త తరుణ్ గీసిన లోకేశ్, ఎమ్మెల్సీ కంచర్ల చిత్రం

రామకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లెకు చెందిన టీడీపీ క్రియాశీలక కార్యరక్త నవీన్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌పై ఉన్న అభిమానంతో ఆయన పుట్టినరోజు సందర్భంగా తన రక్తంతో నారా లోకేష్, కంచర్ల శ్రీకాంత్ చిత్రాలను గీయించి శుభాకాంక్షలు తెలిపాడు. ఆరిమానుపెంటకు చెందిన టీడీపీ కార్యకర్త తరుణ్ చిత్రాన్ని చిత్రీకరించాడు.

ఒంటరి ఏనుగు బీభత్సం

- మామిడి చెట్ల ధ్వంసం
- నేలరాలిన కాయలు

కల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో సోమవారం రాత్రి ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. 20 ఏళ్ల వయసు గల మామిడి చెట్లు ధ్వంసమయ్యాయి. సుమారు 2 టన్నుల మామిడికాయలు నేల రాలాయి. మండలంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతమానుపెంట నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాళెం పంచాయతీ కోటపల్లి సమీపానికి చేరుకుంది. జూపల్లిలోని రైతు సుబ్బరత్నకు చెందిన 20 ఏళ్ల మామిడిచెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. పలు మామిడిచెట్లను మొదళ్ల వరకు విరిచేసింది. సుమారు రెండు టన్నుల మామిడికాయలను నేలరాల్చింది. అలాగే సమీపంలోని మరో రైతు చంద్రమోహన్‌కు చెందిన మామిడిచెట్లను విరిచేసి మామిడికాయలను నేల రాల్చింది. అనంతరం ఒంటరి ఏనుగు సమీపంలోని అడవిలోకి చేరుకుంది. మంగళవారం ఉదయం మామిడితోట వద్దకు వెళ్లిన రైతు సుబ్బరత్న ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లను చూసి ఆందోళన చెందాడు. 20 ఏళ్ల క్రితం నాటిన మామిడిచెట్లను ఒంటరి ఏనుగు రాత్రికి రాత్రే ధ్వంసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు (ఇన్‌సెట్‌లో) నేలరాలిన మామిడికాయలు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

PLOT FOR SALE
తిరుపతి కలెక్టర్ ఆఫీస్ ప్రక్కన శాంభవి లే అవుట్ నందు తూర్పు పడమర దిక్కుల గల ప్లాట్లు అమ్మకానికి కలవు. సైజు 36x50 ఆసక్తికలవారు సంప్రదించండి. 98480 37385. (No Brokers కొనుగోలుదారులు మాత్రమే.)
AJT -200877

WANTED
Gurappa Parameswara Electrical & Civil Works, Trupati. Walk-In-Hiring - Accountant. Must have a Degree in Accounting (or) Finance atleast 5 years of work Exp. Should know how to use accounting Software must understand GST & Taxes. Cont. : 91333 09137, email :gurappaparameswara@gmail.com
AJT - 1188

PLOTS FOR SALE
6 లక్షలకే తిరుపతి IIT, IISER విద్యా సంస్థల ప్రక్కన ఫైనల్ అప్రూవ్‌డ్‌తో ప్లాట్లు డైరెక్ట్ ఓనర్ స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 95027 74175/ 79959 92114.
AJT -1184

WANTED
మీరు 10th క్లాస్ పాస్ అయి వున్నారా! అయితే LIC భీమాసఖి (జీతం + కమిషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell : 90599 19948.
AJT - 1183

బంగారం కొనబడును
మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237527

REAL ESTATES
స్మార్ట్ సిటీ తిరుపతి ప్రతి ఏరియాలో ఓపెన్ ప్లాట్స్ పేరూరు- తుమ్మలగుంట బైపాస్ కమర్షియల్ ప్లాట్స్, ఇల్లులు, విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ల్యాండ్స్ తీసి ఇవ్వబడును మరియు అమ్మించబడును. సంప్ర 79974 61827
AJT -1144

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే

వెదురుకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'ఇది మంచి ప్రభుత్వం. అరాచకం, హింస, దౌర్జన్యాలను సహించను. గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే నా లక్ష్యం' అని రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ స్పష్టం చేశారు. కార్వేటినగరం పెద్దహరిజనవాడలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 'మన ఊరికి-మన థామస్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో థామస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇండస్ట్రీలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రత్యర్థుల భూములు లాక్కోవడం, అక్రమ కేసులు బనాయించడం వంటి గలీజు పనులు తన హయాంలో ఉండబోవని చెప్పారు. కార్వేటినగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రతి గ్రామానికి వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకుని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2047 కల్లా అమరావతిని ఆసియాలో ప్రముఖ పట్టణంగా సీఎం అభివృద్ధి చేస్తారన్నారు. అంతకుముందు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు మురళీమోహన్, మాజీ వైస్ ఎంపీపీ తోటి రవికుమార్ గజమాలతో థామస్‌ను సత్కరించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఎం కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సతీష్‌కుమార్, టీడీపీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగ్రాలయయాదవ్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చల్లాను కలిసిన చౌడేపల్లె ముస్లిం నాయకులు


రొంపిచెర్లలో చల్లాబాబును కలిసిన మైనార్టీ నాయకులు

చౌడేపల్లె/రొంపిచెర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లి మండలం దాదేపల్లి ముస్లిం మైనార్టీ నాయకులు మంగళవారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చేనెల 9, 10వ తేదీల్లో జరిగే గంధోత్సవం, ఉరుసు ఉత్సవాలకు చల్లాను ఆహ్వానించారు. టీడీపీ మైనారిటీ మండలాధ్యక్షులు మహ్మద్‌గని, అమీద్‌ఖాన్, సైదీఖాన్, ఇనుబ్‌సాబ్, సైయ్యాద్‌బాషా, పారుక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చదళ్లలో జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి ని ఆహ్వానించి ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, విరూపాక్షి, నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు గుర్తించడానికే సదస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాము

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు గుర్తించడానికే ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.రాము తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లగుట్లపల్లె తాండాలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, ఆర్ఐ ఫణికుమార్, కమిటీ అధ్యక్షుడు రామయ్య, సభ్యులు వెంకటరమణ, బాలమునెప్ప, ముని, మండల సర్వేయర్ శ్రీనివాసులు నాయక్, బాలాజీనాయక్, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


పనులు పరిశీలిస్తున్న ఈఈ సుబ్బారెడ్డి

సోమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సోమల వ్యవసాయ మార్కెట్ యార్డులో అసంపూర్తి పనులు వేగవంతం చేయాలని ఈఈ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి యార్డులో పనులను పరిశీలించారు. మే 15 నుంచి టమోటా, మామిడి కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టమోటా రైతులు సోమలలోనే అమ్మకాలు జరిగేలా పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. యార్డులో విద్యుత్, తాగునీరు, రైతులకు విశ్రాంత గదులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ హరినాథ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

యువకుల అదృశ్యం



ప్రవీణ్ నాయక్, గణపతి నాయక్

రామకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీర్నమలతాండా, గుట్టూరు తాండాకు చెందిన ఇద్దరు యువకులు గత రెండు రోజులుగా కనిపించలేదు. వీర్నమలతాండాకు చెందిన ప్రవీణ్ నాయక్ గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో , గుట్టూరు తాండాకు చెందిన గణపతి నాయక్ కుప్పం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇద్దరూ ఇటీవల ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులయ్యారు. ఈనెల 26న ఆధార్ కార్డులో కరెక్షన్ కోసం కుప్పానికి వెళ్లారు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గత రెండు రోజులుగా వెతికారు. అయినా యువకుల ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే పోటీల్లో పుంగనూరు విద్యార్థి ప్రతిభ



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పుంగనూరు విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ సదాశివ తెలిపారు. ఈనెల 26 నుంచి 28 వరకు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన 14వ సైలెంట్ నైట్ కరాటే కప్-2025 పోటీల్లో పుంగనూరుకు చెందిన హరిత్‌కృష్ణ ప్రతిభ చూపి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడని వివరించారు.

పాత సామాన్ల దుకాణం దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

పుంగనూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎస్ఎస్‌పేటలోని రాంనగర్‌లో కె.దాదాపీర్‌కు చెందిన పాత సామాన్ల గుజిరి దుకాణం మంగళవారం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు సిబ్బందితో చేరుకుని మంటలను అదుపుచేశారు.

పశువుల దాహార్తికి నీటితొట్టెలు



రొంపిచెర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రొంపిచెర్ల మండలానికి 98 పశువుల కోసం తాగునీటి తొట్టెల నిర్మాణాలు మంజూరయ్యాయి. నీటి తొట్టెలు వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇప్పటికే సుమారు 70 నీటి తొట్టెలు నిర్మాణం జరిగినట్లు ఏపీవో బాలమురళి తెలిపారు. ఒక్కొక్క తొట్టె నిర్మాణానికి ప్రభుత్వం రూ.33 వేలు మంజూరు చేస్తోందని.. నీటి సౌకర్యం ఉన్న చోట నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని ఐటీఐలో ప్రవేశానికి వచ్చేనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లోనూ, సమీప ఐటీఐ కళాశాలల్లోనూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం 89 పెద్దూరులో నారాయణప్ప నిల్వ ఉంచిన 200 కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. నిందితుడు నారాయణప్ప పరారయ్యాడు.

ద్విచక్రవాహనం బోల్తా పడి విద్యార్థికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పుంగనూరులో జరిగింది. పట్టణానికి చెందిన ముబారక్ కుమారుడు తయాబ్ (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ప్రత్యేక శిక్షణ తరగతులకు ద్విచక్రవాహనంలో వెళ్లి తూర్పుమొగసాల వద్ద వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో తయాబ్ తీవ్రంగా గాయపడగా పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడుల నివారణకు త్వరలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. శ్రీకాళహస్తిలో జర్నలిస్టు శ్రీనివాసులుపై మంగళవారం కొందరు వ్యక్తులు దాడికి పాల్పడడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రతి మూడు నెలలకొకసారి ఎస్పీతో కలసి సమావేశాన్ని నిర్వహించి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం



చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది. ట్రాఫిక్ ఏఎస్ఐ నారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. మతిస్థిమితం లేని ఓ మహిళ కొంతకాలంగా ఎన్టీఆర్ విగ్రహానికి సమీపంలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నడవలేని స్థితిలో అక్కడే ఉండేది. మంగళవారం సాయంత్రం ఆమె దేక్కుంటూ రోడ్డు దాటుతుండగా పరదరామి నుంచి చిత్తూరు బస్టాండ్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసినవారు 70933 40019 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రేపటినుంచి వేసవి క్రీడా శిక్షణ తరగతులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ తరగతులు గురువారం నుంచి జరుగుతాయని డీఎస్‌డీవో బాలాజి తెలిపారు. బంగారుపాళ్యం ప్రభుత్వ క్రీడామైదానంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వాలీబాల్ కోచ్‌లుగా మాజీ డీఎస్‌డీవో సుదర్శన్‌నాయుడు, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు మురారి, ఖోఖో కోచ్‌గా మధు, కబడ్డీ కోచ్‌గా అరవింద్ బాబు వ్యవహరిస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారుడుల ఆయా కోచ్‌ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు టీడీపీ సంస్థాగత ఎన్నికలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా గ్రామ కమిటీ కార్యవర్గం, బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉదయం 8 గంటలకు నారగల్లు, 9 గంటలకు ఏఎల్ పురం, 10 గంటలకు వెంగమాంబపురం, 11 గంటలకు 197 రామాపురం, మధ్యాహ్నం 12 గంటలకు కమ్మతిమ్మపల్లె, ఒంటి గంటకు కృష్ణజమ్మాపురం, 3 గంటలకు కుప్పిగానిపల్లె, సాయంత్రం 4 గంటలకు మరకాల కుప్పం, 5 గంటలకు బొమ్మసముద్రం, 6 గంటలకు గొల్లమడుగులో ఎన్నికలు నిర్వహిస్తారని ఆ ప్రకటనలో వివరించింది.

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రైల్వేస్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) చంద్రశేఖర్‌గుప్తా మంగళవారం తనిఖీ చేశారు. కాణిపాకం వరసిద్ధుడిని దర్శనానంతరం రైల్వేస్టేషన్‌కొచ్చి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ మొత్తం కలియతిరిగారు. ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో రైల్వేపోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీలు మెరుగ్గా నిర్వహించాలని చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కుప్పం డిపో ఎదుట రిలే దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు


పుంగనూరులో రిలే నిరాహార దీక్ష

కుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించి ఆర్టీసీ సిబ్బందిలో ఉన్న ఆందోళన తొలగించాలని ఎన్ఎంయూఏ కుప్పం డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, కార్యదర్శి ఈ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో రెండోరోజైన మంగళవారం నాడు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్ఆర్‌బీఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలని, గ్యారేజ్ సిబ్బందికి ప్రయోజనాలను కల్పించాలని, అన్ని యూనిట్లలో పెండింగులో ఉన్న ఏఏఎస్ ఇంక్రిమెంట్లు, సిబ్బందికి పనిష్మెంట్ అప్పీలు కోసం ఏసీఎల్, హైకోర్టులో పిటిషన్‌కు అవకాశం కల్పించాలని, అనారోగ్యంతో ఉన్న, కనీస విద్యార్హత లేని డ్రైవర్లను బలవంతంగా కండెక్టర్ అండ్ డ్రైవర్ రెండు డ్యూటీలు టిమ్‌తో బలవంతంగా పంపే చర్యలు మానుకోవాలని, సంస్థలో సీనియారిటీ , పద్ధతి ప్రకారం లేకుండా ఓడీలు వాడే విధానం సరిచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు అత్యవసర సమయాల్లో 3 రోజుల సెలవు మంజూరు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, పదవీ విరమణ చేసి ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి జీవన భృతి చెల్లించాలని కోరారు. ఎన్ఎంయూఏ నాయకులు యు.మొగిలీశ్వరయ్య, ఏవీ.నారాయణ, జి.రహంతుల్లా, ఎంసీ.నాయక్, ఎస్ఆర్.రాజు, పి.చంద్రకళ, ఎస్వీఎస్.కుమారి, ఏసీ.శేఖర్, వైవీ.రమణ, బాలకృష్ణ, ఎన్.వెంకటేశ్, సీకే.పుష్పరాజ్, ఎం.శ్రీనివాసులు, బి.ఈశ్వరన్, బీజే.నాయక్ పాల్గొన్నారు.

● పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరాహారదీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పుంగనూరు ఆర్టీసీ డిపో కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. సంఘ నాయకులు మునికృష్ణ, రత్నం, చంద్రప్ప, అనసూయమ్మ, మంజులమ్మ రులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కంచర్ల జన్మదిన వేడుకలు


కుప్పంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

కుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు మంగళవారం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత బైపాస్ రోడ్డులోని బాలసుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తర్వాత పట్టణంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా అన్న క్యాంటీన్‌లో అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు టీడీపీ యువ నాయకుడు హర్షధర్మతేజ ఆధ్వర్యంలో తిరుపతి గంగమాంబ ఆలయం ఆవరణలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్. సురేశ్ బాబు, కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు వీజీ.ప్రతాప్, సత్యేంద్రశేఖర్, నాయకులు గోపీనాథ్, ఆర్ఆర్.రవి, మంజునాథ్, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే కిశోర బాలికల భద్రత


కుప్పంలో మాట్లాడుతున్న సీడీపీవో చంద్రకళ


చౌడేపల్లెలో మాట్లాడుతున్న ఎంఈవో కేశవరెడ్డి


పుంగనూరులో...


పలమనేరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

కుప్పం/శాంతిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల భద్రతలో చైతన్యం తీసుకురావడంతోనే వారికి భద్రత కల్పించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.చంద్రకళ అన్నారు. స్థానిక మండల సచివాలయంలో మంగళవారం కిశోర వికాసం మండల స్థాయి సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, పీఎసీఎస్‌వో చట్టం, లింగ వివక్షత, బాలికల నాయకత్వ సాధికారత, విద్య ప్రాముఖ్యత వంటి అంశాల గురించి వర్క్‌షాప్‌లో చర్చించారు. మే 2 నుంచి జూన్ 10 వరకు జరిగే సమ్మర్ క్యాంపులో వారి వారి శాఖలకు సంబంధించి చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, అనసూయ, దిల్షాద్, లక్ష్మి, స్థానిక సచివాలయ పోలీసులు, మహిళా పోలీసులు, విద్యాశాఖ సీఆర్పీలు, వీవో లీడర్లు, వెలుగు సీసీలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు: ఆడపిల్లలను కాపాడటం అందరి బాధ్యత అని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

● శాంతిపురంలో: శాంతిపురం మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం మండల స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కల్పన సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమరజ్యోతి, ఏపీఆర్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణ, కల్పన, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శశికుమార్, సంఘమిత్రలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు: బాలికలకు చదువే విలువైన ఆభరణమని.. కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని పులిచెర్ల ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

● పుంగనూరు రూరల్: గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏపీఎం కృష్ణప్ప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆయేషా నజ్రీత తాజ్, ఫెమీదాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● చౌడేపల్లె/సోమల/సదుం/రామకుప్పం: బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారమవుతోందని ఎంఈవో కేశవరెడ్డి అన్నారు. మంగళవారం చౌడేపల్లె, సోమల, సదుం, రామకుప్పం ఎంపీడీవో కార్యాలయాల్లో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలి: యూటీఎఫ్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ బలోపేతం అవుతుంది' అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బదిలీల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ పాఠశాల వ్యవస్థను.. ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేసిందన్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల అంశంలో ప్రభుత్వం రోజుకో కసరత్తు చేయడం ఉపాధ్యాయుల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతులు, రేషనలైజేషన్‌కు ఉపాధ్యాయుల్లో నెలకొన్న సమస్యలు నివృత్తి చేయడానికి జిల్లా స్థాయిలో సంఘం కృషి చేస్తోందన్నారు. సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, రెహనాబేగం, ప్రసన్నకుమార్, బాషా, మునిరత్నం పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. 15 మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించి, వారిపై కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం జిల్లా కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరు పరిచారు. విచారించిన ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వేడుకగా పెరుమాళ్లపల్లె గంగ జాతర

యాదమరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లెలో తిరుపతి గంగమ్మ జాతర వేడుకగా ప్రారంభమైంది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గరిగెను గ్రామంలో ఊరేగించారు. మంగళవారం ఉదయం గంగమ్మ విశ్వరూప దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా యల్లమ్మ ఆలయంలో మండల పూజ


మండల పూజకు కలశం తీసుకొస్తున్న భక్తులు

కల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రానికి సమీపంలోని వగళ్లవారిపల్లి బస్టాపు వద్ద నూతనంగా నిర్మించి పూజలందుకుంటున్న యల్లమ్మ ఆలయంలో మంగళవారం మండల పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గంగ స్వీకరణ, శాంతి హోమం, మహాభిషేకం, కలశ సమర్పణ, అర్చనలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతురాలైన అమ్మవారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు జరిగింది. వేడుకలో ఆలయ కమిటీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, అర్చకులు శ్రీనివాసమూర్తి దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్యలహరి పారాయణం



చౌడేపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైష్ణవిదేవి ఆలయంలో సౌందర్య లహరి పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో చౌడేపల్లె, పుంగనూరు, మదనపల్లెకు చెందిన అమ్మవారి భక్తులు, ఆలయ నిర్వాహకురాలు శ్రావణి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రోడ్డు పనులను వేగవంతం చేయండి: మురళీమోహన్



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వావిల్‌తోట పంచాయతీ పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. వెంకటాపురం, కండ్రిగ తదితర గ్రామాలకు వెళ్లే తారురోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పనులను నెలలోగా పూర్తిచేయాలని చెప్పారు. నాయకులు గంగారపు గోపి, హరి, నాదముని నాయుడు, మధు, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా టీడీపీ, వైసీపీ ఫ్లెక్సీలు

- ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో తొలగించిన అధికారులు



బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలు

పాలసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆముదాల గ్రామంలో జరుగుతున్న ద్రౌపది తిరునాళ్ల నేపథ్యంలో మంగళవారం వైసీపీ, టీడీపీ నాయకులు పోటాపోటీగా బస్టాప్ కూడలి ప్రాంతంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యకర్తలైతే ఓ అడుగు ముందుకేసి రాబోయేది వైసీపీ ప్రభుత్వమేనని.. వడ్డీతో సహా చెల్లిస్తామని ఫ్లెక్సీ పెట్టడంతో పోలీసులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. మరోవైపు గ్రామస్తులు కూడా రెండు పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని పోలీసులను కోరారు. ఒక దశలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సాయంత్రం ఈవోపీఆర్డీ రమేష్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు పార్టీల వారిని పిలిపించి, ఫ్లెక్సీలను తొలగించారు.

చిత్తూరు రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్ఎం



రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రైల్వేస్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) చంద్రశేఖర్‌గుప్తా మంగళవారం తనిఖీ చేశారు. కాణిపాకం వరసిద్ధుడిని దర్శనానంతరం రైల్వేస్టేషన్‌కొచ్చి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ మొత్తం కలియతిరిగారు. ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో రైల్వేపోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీలు మెరుగ్గా నిర్వహించాలని చెప్పారు.

నడివీధి గంగమ్మ జాతర మహోత్సవం



అమ్మవారిని దర్శించుకున్న మేయర్ అముద, తదితరులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్టేట్ సంజయ్‌గాంధీ నగర్‌లో నడివీధి గంగమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్త, స్థానిక కార్పొరేటర్ హరిణి రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. అమ్మవారిని మేయర్ అముద, కార్పొరేటర్ నవీన్‌కుమార్, ముత్తిరేవుల లోకేష్‌రెడ్డి, యువరాజుల నాయుడు, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడుల నివారణకు త్వరలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. శ్రీకాళహస్తిలో జర్నలిస్టు శ్రీనివాసులుపై మంగళవారం కొందరు వ్యక్తులు దాడికి పాల్పడడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రతి మూడు నెలలకొకసారి ఎస్పీతో కలసి సమావేశాన్ని నిర్వహించి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

గుడిపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్‌లో నిరుపేదలకు మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ మండల అధికార ప్రతినిధి బాలసుబ్రహ్మణ్యయాదవ్, మాజీ సర్పంచ్ గోవిందగౌడ్, మురారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేని సద్వినియోగం చేసుకోండి



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు

నింద్ర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషగిరిరావు అన్నారు. మంగళవారం నింద్రలో సర్వేను పర్యవేక్షించారు. 2,700 ఎకరాలకు తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కో బృందంలో ఇద్దరు సర్వేయర్లు, ఇద్దరు వీఆర్వోలు ఉంటారన్నారు. రీసర్వే డీటీ నీలావతి, సర్వేయర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ఊతమిద్దాం



పాదయాత్ర చేస్తున్న ఈశాప్రియ తీర్థస్వామి బృందం

నగరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయానికి ఊతమిద్దామని ఉడిపి ఆడమూరు శ్రీకృష్ణమఠం పీఠాధిపతి ఈశాప్రియ తీర్థ స్వామి తెలిపారు. ధర్మ పరిరక్షణలో భాగంగా పాదయాత్రగా వచ్చిన ఆయన మంగళవారం సాయంత్రం కామాక్షి సమేత కరకంఠేశ్వరాలయానికి విచ్చేసి, పూజలు చేశారు. దేశంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించే దిశగా అందరూ పనిచేద్దామన్నారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. తమిళనాడు షోళింగర్‌లోని నరసింహస్వామి ఆలయం నుంచి ప్రారంభించిన పాదయాత్ర ఇంద్రకీలాద్రి కనకదుర్గ ఆలయం వరకు చేస్తామని చెప్పారు.

పశుగ్రాసం వితరణ



పూతలపట్టు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు, పెనుమూరు మండలాల పరిధిలోని కలిగిరికొండకు శ్రీసన్నిధి ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకర్ నాయుడు తన సొంత నిధులతో మూడు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని మంగళవారం వితరణ చేశారు. కలిగిరికొండపై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పశువులు, లేగదూడలను భక్తులు వితరణ చేస్తుంటారు. వీటి కోసం రూ.30 వేల విలువైన పశుగ్రాసాన్ని ఆలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమలాకర్ నాయుడు, కుమారస్వామి, ప్రకాష్, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అరకొర సౌకర్యాల నడుమ 'నగర వనం'





జిమ్ పరికరాల వద్ద అసంపూర్తి పనులు - జారుడు బండ వద్ద తగిన మోతాదులో నింపని ఇసుక





వాహనాల పార్కింగ్ స్థలం వద్ద ఇలా..

వెదురుకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం అటవీప్రాంతమైన కుప్పానిగుంట వద్ద 'నగర వనం' ఏర్పాటు చేశారు. ఈ వనంలో ఇప్పటికీ అరకొర సౌకర్యాలే ఉన్నాయి. జిమ్ పరికరాలు ఉన్న ప్రాంతాన్నీ అసంపూర్తిగా వదిలేశారు. పిల్లల కోసం ఏర్పాటు చేసిన జారుడు బండ వద్ద, ఇతర ప్రాంతాల్లో సన్నటి ఇసుకకు బదులు గలుగు ఇసుక తోలారు. దీనివల్ల పిల్లల శరీరం గోక్కు పోవడం, గాయాలవడం పరిపాటిగా మారింది. పార్కింగ్‌కు స్థలం కూడా చదును చేయకుండా వదిలేశారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం కూడా సరిగా లేదన్న విమర్శలున్నాయి. ఈ ప్రభుత్వంలోనైనా ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అరాచకం, దౌర్జన్యాలు సహించను: ప్రభుత్వ విప్ థామస్



థామస్‌ను గజమాలతో సత్కరిస్తున్న మురళీమోహన్, రవికుమార్ తదితరులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'ఇది మంచి ప్రభుత్వం. అరాచకం, హింస, దౌర్జన్యాలను సహించను. గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే నా లక్ష్యం' అని రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ స్పష్టం చేశారు. కార్వేటినగరం పెద్దహరిజనవాడలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 'మన ఊరికి-మన థామస్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో థామస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇండస్ట్రీలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రత్యర్థుల భూములు లాక్కోవడం, అక్రమ కేసులు బనాయించడం వంటి గలీజు పనులు తన హయాంలో ఉండబోవని చెప్పారు. కార్వేటినగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రతి గ్రామానికి వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకుని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2047 కల్లా అమరావతిని ఆసియాలో ప్రముఖ పట్టణంగా సీఎం అభివృద్ధి చేస్తారన్నారు. అంతకుముందు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు మురళీమోహన్, మాజీ వైస్ ఎంపీపీ తోటి రవికుమార్ గజమాలతో థామస్‌ను సత్కరించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఎం కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సతీష్‌కుమార్, టీడీపీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు తోటి మురళీమోహన్, మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బీగాల రమేష్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు, రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాదిరాజు జనార్దనరాజు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మేకం రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం: సీడీపీవో



సమావేశంలో ప్రసంగిస్తున్న సీడీపీవో పద్మసునంద

వెదురుకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికడతామని కార్వేటినగరం సీడీపీవో పద్మసునంద తెలిపారు. మంగళవారం కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో 'కిశోరి వికాసం'లో భాగంగా ఏఎన్ఎంలు, ఎంఎస్‌కేలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు, వెలుగు వీవో లీడర్లు, సీఆర్పీలతో సమావేశమయ్యారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో చట్టం, మొబైల్ వాడకం, సైబర్ నేరాలు తదితర అంశాలపై ఈ వేసవి కాలంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్, ఏపీఎం కవిత, సూపర్ వైజర్లు శ్యామిని, ఇందిర పాల్గొన్నారు. ● వెదురుకుప్పం ఎంపీడీవో సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఏపీఎం పరశురాం రెడ్డి, ఎంఈవో మహేశ్వరరావు, శిక్షకులు హాజరయ్యారు.

యాదమరి: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వేణు, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ఏపీఎం ఈశ్వరి, జిల్లా లీగల్‌సెల్ అధికారి వెంకటేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు లలిత, సెల్వకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, విజయ్‌కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అమాసకు సన్మానం



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గానికి చెందిన అమాస రాజశేఖర్‌రెడ్డి చిత్తూరు డీసీసీబీ చైర్మన్ పదవికి ఎంపికైన విషయం తెలిసిందే. కొత్తవెంకటాపురం గ్రామానికి చెందిన పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి బొడపాటి బాబునాయుడు(నరసింహులునాయుడు), శ్రీరంగరాజుపురం మండలం గంగమ్మగుడి గ్రామానికి చెందిన పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కరణం జయచంద్రనాయుడు మంగళవారం ఉదయం తిరుపతిలో నివాసం ఉంటున్న అమాసను కలిసి, సన్మానించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం



చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది. ట్రాఫిక్ ఏఎస్ఐ నారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. మతిస్థిమితం లేని ఓ మహిళ కొంతకాలంగా ఎన్టీఆర్ విగ్రహానికి సమీపంలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నడవలేని స్థితిలో అక్కడే ఉండేది. మంగళవారం సాయంత్రం ఆమె దేక్కుంటూ రోడ్డు దాటుతుండగా పరదరామి నుంచి చిత్తూరు బస్టాండ్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు 70933 40019 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. 15 మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించి, వారిపై కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం జిల్లా కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరు పరిచారు. విచారించిన ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో బీసీ, ఓసీ మహిళలకు 90 రోజులపాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉచిత కట్టుమిషన్, ఆర్థికసాయం కూడా ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్ నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, జనార్దన్, హేమచంద్రనాయుడు, ఎంపీడీవో శ్రీధర్, ఎంఈవో నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పెరుమాళ్లపల్లె గంగ జాతర



గంగమ్మ విశ్వరూప దర్శనం

యాదమరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లెలో తిరుపతి గంగమ్మ జాతర వేడుకగా ప్రారంభమైంది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గరిగెను గ్రామంలో ఊరేగించారు. మంగళవారం ఉదయం గంగమ్మ విశ్వరూప దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనంతో జాతర ముగుస్తుంది.

బట్టువాళ్లూరులో..

గుడిపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బట్టువాళ్లూరులో మంగళవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులనాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఎస్ఐ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు శంకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ సాంబశివనాయుడు, నాయకులు రవినాయుడు, శేఖర్‌నాయుడు, గోపి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు పౌష్టికాహారం అందించాలి

గుడిపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీవో కుమార్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కిశోరి వికాసంపై అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. ఎంఈవో గణపతి, బొమ్మసముద్రం వైద్యాధికారి రక్షిత పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో పద్మ సునంద, ఏపీఎం రోజా, తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్యామల, సచివాలయం మహిళా పోలీసులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

యువకుల అదృశ్యం





ప్రవీణ్‌నాయక్, గణపతి నాయక్

రామకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీర్నమలతాండా, గుట్టూరు తాండాకు చెందిన ఇద్దరు యువకులు రెండ్రోజులుగా కనిపించడం లేదు. వీర్నమలతాండాకు చెందిన ప్రవీణ్‌నాయక్ గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో, గుట్టూరు తాండాకు చెందిన గణపతినాయక్ కుప్పం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇద్దరూ ఇటీవల ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులయ్యారు. ఈనెల 26న ఆధార్ కార్డులో కరెక్షన్ కోసం కుప్పానికి వెళ్లారు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతికారు. యువకుల ఆచూకీ లేకపోవడంతో రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలి: యూటీఎఫ్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ బలోపేతం అవుతుంది' అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బదిలీల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ పాఠశాల వ్యవస్థను.. ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేసిందన్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల అంశంలో ప్రభుత్వం రోజుకో కసరత్తు చేయడం ఉపాధ్యాయుల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతులు, రేషనలైజేషన్‌కు ఉపాధ్యాయుల్లో నెలకొన్న సమస్యలు నివృత్తి చేయడానికి జిల్లా స్థాయిలో సంఘం కృషి చేస్తోందన్నారు. సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, రెహనాబేగం, ప్రసన్నకుమార్, బాషా, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు టీడీపీ సంస్థాగత ఎన్నికలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా గ్రామ కమిటీ కార్యవర్గం, బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉదయం 8 గంటలకు నారగల్లు, 9 గంటలకు ఏఎల్ పురం, 10 గంటలకు వెంగమాంబపురం, 11 గంటలకు 197 రామాపురం, మధ్యాహ్నం 12 గంటలకు కమ్మతిమ్మపల్లె, ఒంటి గంటకు కృష్ణజమ్మాపురం, 3 గంటలకు కుప్పిగానిపల్లె, సాయంత్రం 4 గంటలకు మరకాల కుప్పం, 5 గంటలకు బొమ్మసముద్రం, 6 గంటలకు గొల్లమడుగులో ఎన్నికలు నిర్వహిస్తారని వివరించింది.

రేపటినుంచి వేసవి క్రీడా శిక్షణ తరగతులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ తరగతులు గురువారం నుంచి జరుగుతాయని డీఎస్‌డీవో బాలాజి తెలిపారు. బంగారుపాళ్యం ప్రభుత్వ క్రీడామైదానంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వాలీబాల్ కోచ్‌లుగా మాజీ డీఎస్‌డీవో సుదర్శన్‌నాయుడు, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు మురారి, ఖోఖో కోచ్‌గా మధు, కబడ్డీ కోచ్‌గా అరవింద్ బాబు వ్యవహరిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారుడుల ఆయా కోచ్‌ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం, కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లోని వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు కె.భైరవుడు, పి.గణేష్ మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మే 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

టీడీపీ నేతకు నివాళి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి, బీసీల నాయకుడు కవి అలియాస్ చంద్రశేఖర్ ఆచారి అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మొగిలి వెంకటగిరిలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, ఎన్పీ జయచంద్రనాయుడు, ఎన్పీ సూరినాయుడు, ధరణీప్రసాద్ నాయుడు, కోకాప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాకా సత్యనారాయణకు రాజ్యసభ సీటుపై హర్షం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో సాధారణ కార్యకర్తగా చేరి, పార్టీకి విశేష సేవలు అందించిన సీనియర్ నేత పాకా వెంకట సత్యనారాయణకు రాజ్యసభ సీటు ఖరారు చేయడంపై జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

పాత సామాన్ల దుకాణం దగ్ధం

పుంగనూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎస్ఎస్‌పేటలోని రాంనగర్‌లో కె.దాదాపీర్‌కు చెందిన పాత సామాన్ల గుజిరి దుకాణం మంగళవారం దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు సిబ్బందితో చేరుకుని మంటలను అదుపుచేశారు.